వాహనదారులు హెల్మెట్ ధరించాలి

జిల్లా ఎస్‌పి ఉప్పాడ రవిప్రకాష్

ప్రజాశక్తి - ఉండి

హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని ద్విచక్ర వాహనదారులకు జిల్లా ఎస్‌పి ఉప్పాడ రవిప్రకాష్ సూచించారు. మంగళవారం చెరుకువాడలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలకు గురైనప్పుడు తలకు గాయాలు కాకుండా హెల్మెట్ కాపాడుతుందన్నారు. హెల్మెట్ పెట్టుకోకుండా ప్రయాణం చేసే ద్విచక్ర వాహనదారులకు జరిమానా విధించకుండా, హెల్మెట్ కొనుక్కోవడం లేదా ఇంటి దగ్గర నుండి తెచ్చుకుని వెళ్లాలని సూచించారు. అనంతరం ఉండి ఎస్‌ఐ కె.గంగాధర్‌రావు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ వాడాలని లేకపోతే జరిమానా విధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిలిచిన.. కు.ని ఆపరేషన్లు

కరోనా నుంచి ప్రభుత్వాసుపత్రుల్లో ఇదే పరిస్థితి
ఏలూరు జిల్లాలో పది నెలల్లో చేసింది 20 ఆపరేషన్లే
పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఇదే పరిస్థితి
ప్రయివేటు ఆసుపత్రులో ఆపరేషన్‌కు రూ.10 వేలకుపైగా వసూలు
పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను ప్రభుత్వాసుపత్రుల్లో చేయకపోవడంతో సామాన్య ప్రజానీకం పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. కరోనాకు ముందు వరకూ జిల్లా, ఏరియా, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లతోపాటు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని పిహెచ్‌సిల్లోనూ కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరిగేవి. అంతేకాకుండా ప్రత్యేక శిబిరాలు పెట్టి మరీ కుటుంబ నియంత్రణ చికిత్సలు చేసేవారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసుకున్న వారికి నగదు, వస్తువుల రూపంలో బహుమతులు సైతం అందించేవారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టేసింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఎక్కడా ప్రభుత్వ పిహెచ్‌సిల్లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరగడం లేదు. ఏరియా ఆసుపత్రుల్లో చేస్తున్నట్లు చెబుతున్నప్పటికీ అవి నామమాత్రంగానే ఉంటున్నాయి. దీంతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకోవాలంటే ప్రయివేటు ఆసుపత్రుల్లో రూ.పది వేల నుంచి రూ.15 వేలు చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో సామాన్య ప్రజానీకం ఆర్థిక భారాన్ని తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పది నెలల్లో చేసింది 20 ఆపరేషన్లే

ఏలూరు జిల్లాలో 60 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 14 అర్బన్ హెల్త్ సెంటర్లు, జిలా ఆసుపత్రి, జంగారెడ్డిగూడెం, నూజివీడుల్లో ఏరియా ఆసుపత్రులు, కైకలూరు, దెందులూరులో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో 32 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పలు ఏరియా, కమ్యూనిటీ ఆసుపత్రులు ఉన్నాయి. ఏలూరు జిల్లాలో నెలకు కనీసంగా లెక్కించినా 800 వరకూ ప్రసవాలు జరుగుతున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలోనూ దాదాపు ఇదే పరిస్థితి ఉంటుందని చెప్పొచ్చు. ఏలూరు జిల్లాలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి జనవరి వరకూ దాదాపు 17,327 ప్రసవాలు జరిగాయి. దీనిలో 8,464 ప్రభుత్వ, 8,863 ప్రయివేటు ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగాయి. గడిచిన పది నెలల్లో ఏలూరు జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో చేసిన కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు కేవలం 20 మాత్రమే అంటే ఆశ్చర్యపోక తప్పదు. ప్రస్తుత పరిస్థితుల్లో 90 శాతానికిపైగా కుటుంబాలు ఇద్దరు పిల్లలతోనే సరిపెట్టుకుంటున్నాయి. ప్రభుత్వ ఆధ్వర్యంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిలిపివేయడంతో సామాన్య ప్రజానీకం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏలూరులో జిల్లా ఆసుపత్రి, రెండు ఏరియా ఆసుపత్రులు, రెండు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లతోపాటు ద్వారకాతిరుమల, కాగుపాడు, దొరమామిడి, గొల్లపల్లి పిహెచ్‌సిల్లో మాత్రమే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. 60 పిహెచ్‌సిలు ఉంటే కేవలం నాలుగింటిలో మాత్రమే జరుగుతున్నాయని తేటతెల్లమవుతోంది. ఆపరేషన్లు చేస్తున్నట్లు చెబుతున్న ఆసుపత్రుల్లోనూ సీరియస్‌గా జరగడం లేదని జరిగిన ఆపరేషన్ల సంఖ్యను బట్టి అర్థమవుతోంది. పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఇదే పరిస్థితి ఉన్నట్లు చెబుతున్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజానీకం కోరుతున్నారు. పిహెచ్‌సిలో పని చేసే వైద్యులకు ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడులో శిక్షణ ఇస్తున్నామని, త్వరలోనే అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ కుటుంబ నియత్రణ ఆపరేషన్లు ప్రారంభం కానున్నట్లు వైద్యశాఖ అధికారులు చెబుతున్నారు. కాలయాపన చేయకుండా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

ప్రకృతి విపత్తులను సమర్ధవంతంగా ఎదుర్కోవాలి

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

ప్రజల భాగస్వామ్యంతోనే ప్రకృతి విపత్తులను సమర్ధవంతంగా ఎదుర్కోగలమని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రకృతి విపత్తులను ఎదుర్కోవడంపై అవగాహన, ముందస్తు చర్యలపై ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందంతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాణ రక్షణ అనేది మన లక్ష్యమని, దానికి అనుగుణంగా శిక్షణా కార్యక్రమాలు ఉండాలని అన్నారు. రాబోయే ప్రమాదాన్ని ముందుగానే అంచనా వేసి, అందుకు ముందుగా చేయాల్సిన పనులపై పూర్తి అవగాహన కల్పించాలని తెలిపారు. స్థానిక ప్రజలు ముందుగా స్పందిస్తే నష్టాన్ని చాలా వరకు తగ్గించుకోగలుగుతామన్నారు. జిల్లాలో ఆపద మిత్రలను ఎంపిక చేసి శిక్షణ పూర్తి చేశామన్నారు. వారికి సంబంధిత సామగ్రిని అందజేసినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ, మండల పరిషత్ సభ్యులను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని సూచించారు. విద్యార్థులకు త్వరగా అవగాహన చేసుకునే నైపుణ్యం ఉంటుందని, వారికి కూడా శిక్షణ అందిస్తే ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. రోడ్డు, ఇతర ప్రమాదాల్లో ప్రమాద తీవ్రత కంటే సరైన సమయంలో వైద్యం అందకపోవడం వల్ల ప్రాణ నష్టం ఎక్కువగా ఉంటుందన్నారు. నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ మాట్లాడుతూ నరసాపురం, మొగల్తూరు ప్రాంతాల్లో 18 కిలోమీటర్ల సముద్ర ప్రాంతం ఉందని, వశిష్టగోదావరి నరసాపురం, యలమంచిలి, ఆచంట మండలాల్లో విస్తరించి ఉందన్నారు. ఆయా ప్రాంతాల్లో తుపాన్లు, వరదల కారణంగా తరచూ విపత్తులను ఎదుర్కొంటున్నామన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

నేటి నుంచి అవగాహనా కార్యక్రమాలు

ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందంచే ఈ నెల 8వ తేదీ నుంచి అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సూర్యతేజ చెప్పారు. యలమంచిలి మండలం కనకాయలంక, 9న భీమవరం డిఎన్ఆర్ కాలేజీ, 10న నరసాపురం మండలం పిఎం లంక జెడ్‌పి హైస్కూల్, 11న నరసాపురం ఎంపిడిఒ కార్యాలయం, 13న యలమంచిలి మండలం పెదలంక గ్రామపంచాయతీ, 14న భీమవరం ఇండస్ట్రియల్ పార్క్, 16న మొగల్తూరు మండలం కెపిపాలెం, 17న ఆచంట మండలం అయోధ్యలంక మర్రిమూల ప్రాథమిక పాఠశాలలో అవగాహనా కార్యక్రమాలను నిర్వహించనున్నామన్నారు. 20న నరసాపురం మండలం వేములదీవి, 21న మొగల్తూరు మండలం కెపిపాలెం బీచ్‌లో ప్రజలకు అవగాహన కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం కమాండర్ వై.సత్యనారాయణ, బృంద సభ్యులు ఎంవిఆర్.నాయుడు, ఎన్.రామారావు, ఎస్.ఆదినారాయణ, ఆర్.కుమార్‌రాజా, జిల్లా అధికారులు, అన్ని మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.

పబ్లిక్ హెల్త్ డిఇపై ఎంఎల్‌ఎ గ్రంధి ఆగ్రహం

ఎస్‌టిపి ట్యాంక్ పనులపై కలెక్టర్‌కు ఫోన్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అభివృద్ధి పనుల విషయంలో అధికారులు కథలు చెప్పొద్దని, పనులు చేయాలని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ పబ్లిక్ హెల్త్ డిఇ విజయ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో టిడ్కో గృహాలకు సంబంధించి మురుగునీటిని శుద్ధి చేసే ఎస్‌టిపి ట్యాంక్ పనులపై ఆయన సమీక్షించారు. 2018లో ఎస్‌టిపి ట్యాంక్ నిర్మాణానికి టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ వర్క్ ఆర్డర్ తీసుకుని 15 నెలల్లో పనులు పూర్తి చేయాల్సి ఉండగా, ఇప్పటికీ ఎందుకు జాప్యం జరుగుతుందని ఎంఎల్‌ఎ డిఇని ప్రశ్నించారు. కరోనా కారణంగా కొన్ని ఇబ్బందులు తలెత్తినప్పటికీ కరోనా అనంతరం ట్యాంక్ పనులను వేగవంతం చేయడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహించినట్లు తెలుస్తుందని అన్నారు. వెంటనే కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఎస్‌టిపి ట్యాంక్ పనులు పూర్తయితేనే ఆ ఇళ్లలో నివసించే ప్రజల వాడకపు నీటిని శుద్ధిచేసి పూర్తిగా బయటకు వదిలేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని డిఇని ఆదేశించారు. అనంతరం ఎస్‌టిపి ట్యాంకు పనులపై ఎంఎల్‌ఎ గ్రంధి కలెక్టర్ పి.ప్రశాంతికి ఫోన్ చేసి మాట్లాడారు. నిబంధనల మేరకు 15 నెలల్లో ఎస్‌టిపి ట్యాంకు పనులు పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ ఇప్పటి వరకు పనులు పూర్తి కాలేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. త్వరితగతిన ఎస్‌టిపి ట్యాంకు పనులు పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు.

పబ్లిక్ హెల్త్ డిఇ విజయ్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంఎల్‌ఎ గ్రంధి

విద్యకు అధిక ప్రాధాన్యత

మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యతనిచ్చి అనేక పథకాలు అమలు చేస్తున్నారని, విద్యా విధానంలో మార్పులు తీసుకొచ్చారని రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్‌లో బి.ఫార్మసీ భవనం, మహిళా హాస్టల్ భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ అందరికీ సమాన అవకాశాలు రావాలని జాతీయ విద్యావిధానం అమలు చేస్తున్నామన్నారు. ప్రపంచస్థాయిలో విజయాలు సాధించేలా ఉన్నత విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు కంప్యూటర్ కోర్సులపైనా శిక్షణ ఇస్తున్నామన్నారు. నన్నయ యూనివర్సిటీ హాస్టల్లో వసతులు 15 రోజుల్లోగా పూర్తిస్థాయిలో సమకూర్చాలని రిజిస్ట్రార్‌కు సూచించారు. రూ.ఐదు కోట్లతో యూనివర్సిటీకి వచ్చే రోడ్డు పనులు చేపట్టాలని ఆయన సూచించారు. కళాశాలలో సమస్యలు ఏమైనా ఉంటే తనకు తెలియజేస్తే పరిష్కరిస్తానన్నారు. ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్‌కు రూ.150 కోట్ల విలువైన భూములను గతంలో కేటాయించినట్లు తెలిపారు. క్యాంపస్‌కు సిబ్బందిని కేటాయించాలని కోరారు. ఎం.ఫార్మసీ, ఎంకాం, ఎంసిఎ, ఎంఎస్‌సి డేటా ఎనాలసిస్ కోర్సులు ప్రవేశపెట్టాలని ఆయన విద్యాశాఖ మంత్రిని కోరారు. తాడేపల్లిగూడెంలో మహిళా ఇంజినీరింగ్ కళాశాలను కూడా మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు అందరూ బాగా చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జివి.ప్రసాదరాజు, జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్, జాయింట్ కలెక్టర్ జెవి.మురళీ, యూనివర్సిటీ రిజిస్ట్రార్ అశోక్, ప్రిన్సిపల్ రమేష్, భీమవరం ఆర్‌డిఒ దాసి రాజు పాల్గొన్నారు.


భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ఇంటర్ పరీక్షలకు పటిష్టమైన ఏర్పాట్లు : డిఆర్‌ఒ కృష్ణవేణి

ప్రజాశక్తి - భీమవరం

ఇంటర్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు అధికారులు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి అన్నారు. స్థానిక కలెక్టరేట్లో మంగళవారం రీజనల్ ఇన్‌స్పెక్షన్ అధికారి, కన్వీనర్ కె.చంద్రశేఖర్‌బాబు అధ్యక్షతన ఇంటర్ పబ్లిక్ పరీక్షల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ మార్చి 15వ తేదీ నుంచి ఏప్రిల్ నాలుగో తేదీ వరకు ఇంటర్ పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ కళాశాలలు 10, ఎయిడెడ్ కళాశాలలు 3, ప్రయివేటు అన్‌ఎయిడెడ్ కళాశాలలు 39 మొత్తం 52 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 34,642 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారని, సంబంధిత అధికారులు తగు ఏర్పాట్లు చేయాలని అన్నారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. 52 పరీక్షా కేంద్రాల్లో, 12 స్టోరేజీ కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు వహించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుకు తహశీల్దార్లకు ఆదేశాలు జారీ చేశారు. పరీక్షా సమయానికి అనుగుణంగా బస్సులు నడపాలని ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

జెఇఇ మెయిన్స్‌లో మెరిశారు..

ప్రజాశక్తి - వీరవాసరం

జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో వీరవాసరానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. ఈ నెల 6వ తేదీన విడుదల చేసిన ఫలితాల్లో ఆదిరెడ్డి రూపాదిత్య 99.60 శాతం, యడ్ల భరత్ 98.46 శాతం మార్కులు సాధించారు. భరత్ కుమార్ తండ్రిది సాధారణ వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు కూరగాయల వ్యాపారం చేసుకుంటూ ఆర్థికంగా కష్టతరమైనా తమ కుమారులను ఉన్నత చదువులు చదివించాలనే ఆశయంతో ముందుకు సాగారు. వీరి పెద్ద కొడుకు కూడా గతంలో జెఇఇలో అత్యుత్తమ ఫలితాలు సాధించి ప్రస్తుతం బిటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, సోదరుడు సలహాలతోనే ముందుకు సాగుతున్నట్టు భరత్‌కుమార్ తెలిపాడు. రూపాదిత్య తండ్రి ప్రయివేటు వ్యాపారం చేస్తున్నారు. తల్లి ప్రభుత్వ ఉపాధ్యాయిని. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే తాను ఈ ఘనత సాధించానని రూపాదిత్య తెలిపాడు. వారిని సబ్బారపు వెంకట్రావు అండ్ కమల ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ సబ్బారపు వెంకట్రావు, బోను రామకృష్ణ, ఎంపిటిసిలు గుళ్లిపల్లి విజయలక్ష్మి, బోను జోత్స్నదేవి అభినందించారు.

ఆదిరెడ్డి రూపాదిత్య

భరత్ కుమార్

ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

పాలకొల్లు : జెఇఇ మెయిన్స్ 2023 పరీక్షా ఫలితాల్లో పాలకొల్లు ఆదిత్య విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. దొంగ రవికృష్ణ 98.6 శాతం, కారుమూరి సుమశ్రీ 98.48 శాతం, కప్పల అభిషేక్‌వర్మ 98.33 శాతం, పెనుగొండ సుధీష్ణ 98.17 శాతం, కడలి లక్ష్మీ దుర్గ 97.37 శాతం, ములుగుర్తి పావని 97.11 శాతం మార్కులు సాధించారని కళాశాల డైరెక్టర్ ఎస్‌వి రాఘవరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన అధ్యాపకులను సంస్థ ఛైర్మన్ ఎన్. శేషారెడ్డి, డైరెక్టర్ రాఘవరెడ్డి ఎఒజి.వాసుబాబు అభినందించారు.

పాలకొల్లు : ప్రతిభ కనబర్చిన ఆదిత్య విద్యార్థులు

తణుకురూరల్ : జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని శశి విద్యాసంస్థల ఛైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వైస్ ఛైర్మన్ మేకా నరేంద్రకృష్ణ మంగళవారం తెలియజేశారు. కెఎండి రెడ్డి 99.34 శాతం, ఎం.జీవన్ 98.21 శాతం, పి.పావని 98.09 శాతం, వి.లలిత 96.89 శాతం, ఎ.యోగిత 96.89 శాతం, వైపిఎస్ కార్తీక్ 96.69 శాతం, సిహెచ్‌ఎస్ఎస్ శరణ్ 95.59 శాతం, పి.దత్తప్రియ 95.49 శాతం సాధించారని, 96 శాతంపై ఆరుగురు, 94 శాతం పైగా 16 మంది, 90 శాతం పైగా 24 మంది మార్కులు సాధించారని తెలియజేశారు. ఆయా విద్యార్థులను డైరెక్టర్ మేకా క్రాంతిసుధ అభినందించారు.

కెఎండి.రెడ్డి

ఎం.జీవన్

పి.పావని

వి.లలిత

సమయానికి జీతాలివ్వకపోవడం ప్రభుత్వ వైఫల్యం

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల ఏడో తేదీ వచ్చినప్పటికీ ఉద్యోగులు, పెన్షనర్లకు జీతాలు, పెన్షన్లు చెల్లించకపోవడం రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యమని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతినెలా జీతాలు, పెన్షన్లు ఆలస్యం కావడంతో ఉద్యోగులు, పెన్షనర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఒక్కో నెల 15వ తేదీ వచ్చే వరకూ పెన్షన్లు, జీతాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు అనారోగ్యం విషయమై నిత్యం ఆసుపత్రుల ఖర్చు, ఇళ్ల అద్దెలు, బ్యాంకు రుణాలు, ఇఎంఐలు కట్టడం కష్టతరంగా మారిందని పేర్కొన్నారు. ఇఎంఐలు కట్టడం ఆలస్యమైతే బ్యాంకుల నుంచి పెనాల్టీలు, వడ్డీలు వంటి సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, ఆర్థిక మంత్రి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగానే ఉందని, ఇబ్బందులేమీ లేవని చెబుతూనే ఉద్యోగులకు, పెన్షనర్లకు జీతాలు, పెన్షన్లు సకాలంలో చెల్లించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. జీతాలు రోజుల తరబడి, పిఎఫ్ డబ్బుల కోసం పెట్టుకున్న లోన్లు నెలలు తరబడి, డిఎలు సంవత్సరాలు తరబడి చెల్లించకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఇదే ప్రభుత్వం కరెంటు బిల్లులుగాని, మున్సిపల్ బిల్లులుగాని కట్టడం ఆలస్యమైతే పెనాల్టీలు, వడ్డీలు వేస్తూ ప్రజలపై అదనపు భారాలు వేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఆలస్యంగా జీతాలు, పెన్షన్లు చెల్లించొచ్చా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా ఒకటో తేదీనే జీతాలు, పెన్షన్లు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి ఉద్యోగులు, పెన్షనర్లు చేసే ఆందోళనకు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందని బలరాం పేర్కొన్నారు.

'గడపగడపకు'లో సమస్యలు వెల్లువ

సమస్యలు పరిష్కరిస్తా: జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్

ప్రజాశక్తి - యలమంచిలి

'గడపగడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మండలంలోని చించినాడ గ్రామంలో రెండో రోజు మంగళవారం కొనసాగించారు. అరుంధతీపేటలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్‌కు స్థానికులు సమస్యలను ఏకరువు పెట్టారు. అరుంధతీపేట, విప్పర్తివారిపేటల్లో అర్హులకు ఇళ్ల స్థలాలు, పింఛన్లు, అమ్మఒడి వంటి పథకాలను వర్తింపజేయడంలో స్థానిక వైసిపి నాయకులు పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అర్హత లేని సొంత పార్టీకి చెందిన అగ్రవర్ణాల వారికి, స్థానికేతరులకు ఇళ్ల స్థలాలు ఇచ్చారని, ఒకే ఇంట్లో మూడేసి కుటుంబాలు ఇరుకుగదుల్లో కాపురాలు చేస్తున్నా పట్టించుకోలేదని విమర్శించారు. దీనిపై స్పందించిన జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ సమస్యలను రాతపూర్వకంగా ఇస్తే ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. ఆయన వెంట ఎంపిపి రావూరి వెంకటరమణబుజ్జి, గ్రామ సర్పంచి దంగేటి రాజమణి, ఎంపిటిసి నల్లి సంధ్యారాణి, ఉప సర్పంచి చిన్న, సొసైటీ ఛైర్మన్ సామంతపూడి రాధాకృష్ణంరాజు, స్థానిక వైసిపి నాయకులు విప్పర్తి నవీన్, వడ్డీ రాజు, ముదునూరి రంగరాజు పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాస్

11, 14 తేదీల్లో వెంకయ్యనాయుడు పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఈ నెల 11న భీమవరంలో పర్యటించనున్నారు. ఎస్ఆర్‌కెఆర్, విష్ణు ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్లలో జరిగే పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొనున్నారు. 14వ తేదీ మంగళవారం ఏలూరు జిల్లాలోని ఓ ప్రయివేట్ కార్యక్రమంలో ఆయన పాల్గొనున్నట్లు అధికారులకు సమాచారం అందింది. దీనికి సంబంధించిన బందోబస్తు ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు.

సిమెంట్ రోడ్లకు మహర్దశ : పివిఎల్

ప్రజాశక్తి - కాళ్ల

పంచాయతీ నిధులతో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి మహర్దశ ఏర్పడిందని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. పెదఅమిరంలో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రూ.6.70 లక్షల పంచాయతీ నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అభివద్ధికి నోచుకోని వివిధ ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు నిర్మించే అవకాశం ఏర్పడిందని సర్పంచి డొక్కు సోమేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఉపసర్పంచి జవ్వాది కిషోర్, గ్రామ కార్యదర్శి కనకారావు, కోపల్లె సొసైటీ అధ్యక్షులు వేగేశ్న జయ రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

పెదఅమిరంలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న పివిఎల్ నరసింహరాజు

అధికారులతో సమీక్షిస్తున్న ఎంఎల్ఏ గ్రంథి శ్రీనివాస్

రోడ్ల అభివృద్ధిపై ఎంఎల్ఏ సమీక్ష

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలో ప్రస్తుతం జరుగుతున్న రోడ్ల అభివృద్ధి పనులపై, అలాగే వర్క్ ఆర్డర్ తీసుకున్న కాంట్రాక్టర్లు ఇంకా చేపట్టని పనులపై ఎంఎల్ఏ గ్రంథి శ్రీనివాస్ మున్సిపల్ అధికారులతో మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. పట్టణ ప్రజలు అభివృద్ధికి సహకరించాలని కోరారు. పట్టణాన్ని మరిన్ని హంగులతో తీర్చిదిద్దడానికి శక్తివంచన లేకుండా పనిచేస్తున్నామన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారం దిశగా ఇప్పటికే చర్యలు తీసుకున్నామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఎఇ త్రినాథ్, విద్యుత్ శాఖ ఎడి రాజగోపాల్ చౌదరి, టౌన్ ప్లానింగ్ ఎసిపి రాం, డిఇ నారాయణరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అందించడం అభినందనీయమని మల్లిపూడి పాఠశాల ఉపాధ్యాయులు సాయిరెడ్డి అన్నారు. బైర్రాజు ఫౌండేషన్ నుంచి మల్లిపూడి, జత్తిగ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్‌పై మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సాయిరెడ్డి మాట్లాడుతూ వారం రోజుల పాటు కొనసాగే ఈ కార్యక్రమంలో పెయింటింగ్, పదాల టైపింగ్, లిప్ పదాలను నేర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బైర్రాజు ఫౌండేషన్ నుంచి వచ్చిన టీచర్లు, తోటి ఉపాధ్యాయులు రాంబాబు, శ్రీరాములు , జ్యోతిర్మయి పాల్గొన్నారు.

కాళ్ల ఎస్ఐగా మూర్తి

ప్రజాశక్తి - కాళ్ల

ఎస్ఐ మూర్తి

కాళ్ల మండల ఎస్ఐగా ఆర్‌జిఎస్.మూర్తి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కృష్ణాజిల్లా కోడూరు, మచిలీపట్నం టౌన్, ఆచంట, నర్సాపురం రూరల్, పాలకొల్లు టౌన్, పాలకోడేరు, భీమవరం టూ టౌన్ పోలీస్ స్టేషన్లో ఎస్ఐగా పని చేశారు. భీమవరం డిసిఆర్‌బి ఎస్ఐగా పనిచేసి బదిలీపై కాళ్ల ఎస్ఐగా వచ్చారు. కాళ్ల పోలీసులు, వివిధ పార్టీల నాయకులు ఎస్ఐ మూర్తికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన ఆర్.మల్లికార్జున రెడ్డి బదిలీపై భీమవరం ట్రాఫిక్ ఎస్ఐగా వెళ్లారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా తీర్చిదిద్దాలని ఆర్‌జెడి మధుసూదనరావు ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. నాడు-నేడులో చేపట్టిన పాఠశాల అభివృద్ధి పనులను పరిశీలించారు. పదోతరగతి విద్యార్థులను గ్రేడ్లుగా విభజించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం ఇటీవల ఎనిమిదో తరగతి విద్యార్థులకు అందించిన ట్యాబ్‌ల వినియోగంపై వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి మెనూ ప్రకారం అందుతున్నాయా, వాటి నాణ్యత ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట ఎంఇఒ పుష్పరాజ్యం, ప్రధానోపాధ్యాయిని ఎం.బాలనాగమణి, ఉపాధ్యాయులు గోపాలకృష్ణంరాజు, చింతపల్లి కృష్ణమోహన్ తదితరులు ఉన్నారు.

పాలమూరులో లేగదూడల ప్రదర్శన

ప్రజాశక్తి - పెనుమంట్ర

అప్పుడే పుట్టిన దూడకు జున్ను పాలు సమృద్ధిగా తాగించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని పశుసంవర్ధక శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఇఒ) జేసురత్నం అన్నారు. ఎపి పశుసంవర్ధక శాఖ - పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పాలమూరులో లేగదూడల ప్రదర్శన, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కార్యక్రమం సర్పంచి కాకర రాజేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జేసురత్నం మాట్లాడుతూ దూడకు తన శరీర బరువులో పదో వంతు పాలు అవసరమన్నారు. వాటికి ప్రత్యేక దాణాగా 40 శాతం జొన్నలు, మొక్కజొన్న, 30 శాతం వేరుశెనగపిండి, 10 శాతం తవుడు, 7 శాతం చేపలు పొడి, 10 శాతం బెల్లపు మడ్డి , 3 శాతం ఖనిజ లవణాల మిశ్రమాన్ని దూడ వయసును బట్టి తగిన మోతాదులో ఇవ్వాలన్నారు. తరువాత దూడకు గడ్డి, దాణా పెట్టాలన్నారు. అంతేకాకుండా గాలికుంటు వ్యాధి రాకుండా 8 వారాల తర్వాత టీకా వేయించాలన్నారు. అనంతరం ఆరోగ్యంగా, అందంగా ఉన్న దూడల యాజమాన్యానికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్టేరు వెటర్నరీ ఎడి వాకాని ప్రసాద్, పెంటపాడు డిడి కె.నరసింహారావు, పెనుమంట్ర, ఆలమూరు వెటర్నరీ వైద్యులు డాక్టర్ జి.రవికాంత్ పాల్గొన్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం

ప్రజాశక్తి - పెనుమంట్ర

హెల్మెట్ లేని ప్రయాణం ఎప్పటికైనా మృత్యువుకు దారితీస్తుందని ఎస్ఐ బి.సురేంద్ర కుమార్ అన్నారు. మంగళవారం రెండో రోజు బ్రాహ్మణచెరువులో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సురేంద్ర కుమార్ మాట్లాడుతూ ప్రమాదకర పరిస్థితుల్లో మనిషిని కాపాడేది హెల్మెట్ అన్నారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించొద్దన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసుల సిబ్బంది, వాహన చోదకులు పాల్గొన్నారు.

అవార్డు మరింత బాధ్యత పెంచింది

అవార్డు గ్రహీత, పిహెచ్‌సి డాక్టర్ పూజకు సత్కారం

ప్రజాశక్తి - ఆచంట

ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో భాగంగా కలెక్టర్ చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాన్ని అందుకోవడంతో పాటు ఆసుపత్రి సిబ్బందిచే సత్కారం పొందడం ఆనందం కలిగించినప్పటికీ ఈ అవార్డు మరింత బాధ్యత పెంచిందని ఆచంట వేమవరం పిహెచ్‌సి డాక్టర్ ఎ.పూజ అన్నారు. డాక్టర్ పూజ ఫ్యామిలీ ఫిజీషియన్ సెట్లో భాగంగా రాష్ట్ర స్థాయి ప్రతిభా అవార్డు అందుకోవడంపై ఆసుపత్రి సిబ్బంది మంగళవారం ఆమెను సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ పూజ మాట్లాడుతూ ఆచంట వేమవరం ఆసుపత్రిని మరింత ముందుకు తీసుకెళ్లడమే తన కర్తవ్యమన్నారు. అదేవిధంగా ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా వారికి మెరుగైన వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పిహెచ్‌ఎన్ రత్నకుమారి, ఎంపిహెచ్ ఇఒ వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్లు ప్రసాద్, హెచ్‌విలు, ఎఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు పూజను సత్కరించారు.

15 నుంచి శివరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకూ మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్, ఇఒ యాళ్ల సూర్యనారాయణ తెలిపారు. ఈనెల 18వ తేదీ శనివారం తెల్లవారుజాము నుంచి మహాశివరాత్రి సందర్భంగా యాత్రికులకు విశేష ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకూ మాత్రమే ఆలయంలో అభిషేకాలకు అనుమతి ఉందని చెప్పారు. రాత్రి 8.35లకు జగ జ్యోతి రాత్రి 12 గంటలకు స్వామి వారి పాగా కట్టబడునని చెప్పారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఘనంగా అపరాల మార్కెట్, జట్టు వర్కర్స్ యూనియన్ వార్షికోత్సవం

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అపరాల మార్కెట్, జట్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) 37వ వార్షికోత్సవం స్థానిక పువ్వులపల్లి సుందరయ్య భవనం ఎదుట గ్రౌండ్‌లో గొన్నాబత్తుల నాగేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. 2022 కార్యకలాపాల రిపోర్టును యూనియన్ కార్యదర్శి కొరెడ్ల రామకృష్ణ ప్రవేశపెట్టారు. యూనియన్ సభ్యులు రిపోర్టును ఆమోదించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్, కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు మాట్లాడారు. దేశంలో అసంఘటిత రంగంలో పనిచేసే 40 కోట్ల మంది కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాడ్యూటీ, ఇన్సూరెన్స్ అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అనేక సంవత్సరాలుగా పోరాటాలు చేసినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత 44 కార్మిక చట్టాలను 4 కోడ్లుగా విభజించడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా అదానీ, అంబానీలకు కట్టబెట్టడం దారుణమని విమర్శించారు. హిడెన్ బర్గ్ సంస్థ చేపట్టిన సర్వేలో అదాని మోసాలకు పాల్పడుతున్నాడని, మోసగాడు అని మోడీ ఆయనకు సహకరిస్తున్నాడని తెలిపారు. జాతీయవాదం పేరుతో అదాని మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఏప్రిల్ 5వ తేదీన రైతు, కార్మిక సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా కొరెడ్ల రామకృష్ణ, అధ్యక్షులుగా గొన్నాబత్తుల నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్‌గా చిటికెన రాము, ప్రధాన కార్యదర్శిగా సర్వాల నారాయణరావు, కోశాధికారిగా అగుర్తుల రామోహనరావు, కమిటీ సభ్యులుగా శిద్దిరెడ్డి శేషుబాబు, సుందరపు అప్పలనాయుడు, రావి శ్రీనివాస్, ఆయినాల సత్యనారాయణ, బొడ్డు భవాని శంకరం, ఆయినాల ధర్మారావు, పెంకికోట గోవిందు, చిట్టేటి సత్యనారాయణ, బుద్దాల తాతారావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గొన్నాబత్తుల నాగేశ్వరరావు, కొరెడ్ల రామకృష్ణ, సత్తి కొండలరామిరెడ్డి, అల్లు సుబ్బారావు, జువ్వాది శ్రీను, తట్టాగోట్ల పెద్దిరాజు, మెట్రెడ్డి రమణ, కుంచంగి నానాజీ, లాజరు, సిరపరపు రామారావు పాల్గొన్నారు.

ప్రభుత్వాలవి కార్మిక వ్యతిరేక విధానాలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు విమర్శించారు. ఉల్లిపాయల మార్కెట్ జట్టు కార్మికుల జనరల్ బాడీ సమావేశం సుందరయ్య భవన్‌లో మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి చల్ల చంద్రరావు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరుపు రంగారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏప్రిల్ 5న ఢిల్లీ ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ధర్నాలో హమాలీ రంగంలో నుంచి కూడా పాల్గొంటారని తెలిపారు. హమాలీలకు ఏ రకమైన చట్టాలు లేవని, వారికి సమగ్ర చట్టం చేయాలని, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఏప్రిల్ 5 జరిగే ధర్నాలో పెద్ద ఎత్తున అన్ని సంఘాల నేతలు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అల్లు సుబ్బారావు, బంకురు నాగేశ్వరరావు, కేదిరెడ్డి అప్పన్న, గొర్రెల శీను పాల్గొన్నారు.

అగ్నికుల క్షత్రియుల అభివృద్ధికి కృషి చేస్తా : ఎంఎల్ఏ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం నియోజకవర్గ అగ్నికుల క్షత్రియ యువజన సంఘం నాయకులు మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఏ గ్రంధి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అగ్నికుల క్షత్రియ భీమవరం నియోజకవర్గ సంక్షేమ భవనం నిర్మాణానికి స్థలం ఇప్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ అగ్నికుల క్షత్రియుల అభివృద్ధికి ప్రభుత్వ సహకారంతోపాటు తన సహకారం కూడా ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ భీమవరం నియోజక వర్గ యువజన సంఘం అధ్యక్షుడు తిరుమాని శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మైల కష్ణంరాజు , కొల్లాటి వెంకట రెడ్డి, మోకా సత్తిరాజు, బొమ్మిడి సత్య నారాయణ, ప్రధాన కార్యదర్శి కొప్పాడి మురళీ కష్ణ, కార్యవర్గ సభ్యులు తిరుమాని శ్రీను, మోకా ఏడుకొండలు, నాగిడి నరసింహ స్వామి, వాటాల రాంబాబు, నాగిడి ఏడు కొండలు, మల్లాడి శ్రీను లు పాల్గొన్నారు.

టిడిపి బలోపేతానికి కలిసి పనిచేస్తున్నాం

శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్

ప్రజాశక్తి - మొగల్తూరు



ప్రజలతో మాట్లాడుతున్న షరీఫ్

టిడిపి బలోపేతానికి అందరం కలిసికట్టుగా పనిచేస్తున్నామని శాసన మండలి మాజీ ఛైర్మన్ ఎంఎస్ షరీఫ్ అన్నారు. మంగళవారం మొగల్తూరులోని వెలిది వారివీధిలో రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమాన్ని పార్టీ మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తెమ్మ ఆలయం వద్ద విలేకరులతో ఆయన మాట్లాడారు. టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నరసాపురం నియోజకవర్గాన్ని అగ్రగామిగా రామరాజు తీసుకొచ్చారన్నారు. వైసిపి ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఉందన్నారు. విద్యుత్ బిల్లులు పెరగడంతో తమకొచ్చే సంక్షేమ పథకాలను నిలిపివేశారని ప్రజలు తమ వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి టిడిపితోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు బస్వాని ఏడుకొండలు, కలిదిండి కుమార్ బాబు, వెలిగి ముక్తేశ్వరరావు, మహేష్, పుల్లారావు పాల్గొన్నారు.

వైకల్యం అభివృద్ధికి ఆటంకం కాదు

ప్రజాశక్తి - తణుకురూరల్

వైకల్యం పిల్లల అభివృద్ధికి కారణం కాదని, పిల్లల్లో ప్రతిభను గుర్తించి తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించినట్లయితే వారు అన్ని రంగాల్లో రాణిస్తారని సమగ్ర శిక్ష అదనపు ప్రోజెక్ట్ కో - ఆర్డినేటర్ పి.శ్యాంసుందర్ అన్నారు. మంగళవారం తణుకు భవిత వికలాంగుల శిక్షణా కేంద్రం ఆవరణలో సమగ్రశిక్ష వారి ఆధ్వర్యంలో వికలాంగ పిల్లలకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరం జిల్లా విద్యాశాఖాదికారి ఆర్‌వి రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ప్రభుత్వం వికలాంగ పిల్లలకు సమగ్రశిక్ష ద్వారా ఉపకరణాల ఎంపిక పరీక్షలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జిల్లా విలీన విద్య సమన్వయ కర్త శ్రీమన్నారాయణ మాట్లాడారు. ఈ శిబిరంలో మండల విద్యాశాఖాధికారి ఎస్.శ్రీనివాసరావు, ప్రభుత్వ వైద్య బృందం పాల్గొన్నారు.

జగన్ కోసం సైనికుల్లా పనిచేయాలి

ప్రజాశక్తి - ఆచంట

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావిస్తూ పేదల కోసం అహర్నిశలూ శ్రమిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మరోసారి ముఖ్యమంత్రి అయ్యేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని వైసిపి నియోజకవర్గ పరిశీలకురాలు రుడా ఛైర్ పర్సన్ మేకపాటి షర్మిలారెడ్డి కోరారు. మంగళవారం ఆచంటలో మా నమ్మకం నువ్వే జగన్ అంటూ గృహసారధులు, జగనన్న సచివాలయ కన్వీనర్లకు మండలస్థాయి శిక్షణా కార్యక్రమాన్ని షర్మిలారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఏడాదిలో ఎన్నికలు రాబోతున్న నేపథ్యంలో మీరంతా పెద్ద బాధ్యతను మోస్తున్నారన్నారు. ఎంఎల్ఏ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు మాట్లాడారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తున్నారని గ్లోబల్ ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఆచంట నియోజకవర్గంలో 22 సొసైటీలకు గాను 11 సొసైటీలు బిసిలకు ఇచ్చామని, ఆచంట ఎఎంసి కూడా ఓసిలకు ఐతే రెండు సార్లు ఎస్‌సి మహిళలకు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఆచంట ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, సర్పంచులు సుంకర సీతారాం, కోట సరోజిని, గణేశుల శేషవేణి, జక్కంశెట్టి చంటి పాల్గొన్నారు.

కుక్కలు టీకాలు

ప్రజాశక్తి - పోడూరు

కుక్కలు వ్యాక్సిన్లు వేస్తున్న వైద్యులు

జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా పెనుమదం గ్రామంలో గ్రామీణ పశువైద్యశాల వద్ద మంగళవారం ఎడి జయకర జాన్సన్, మండల పశువైద్య అధికారి డాక్టర్ మహేష్ కుమార్ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు ర్యాబిస్ రాకుండా టీకాలు వేశారు. దాదాపు ఇరవైకి పైగా కుక్కలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఎడి జయకర జాన్సన్ మాట్లాడుతూ ఈ టీకాలు కుక్కలకు వేయించడం వల్ల కుక్కల నుండి వచ్చే ర్యాబిస్ వ్యాధి మనుషులకు, పశువులకు రాకుండా అరికట్టవచ్చున్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ కార్యక్రమాలు అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - తణుకు

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రతి ఒక్కరికీ అందించడమే లక్ష్యమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. మంగళవారం పట్టణంలోని 17వ వార్డు భాష్యం స్కూల్ సమీపంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు అన్ని పథకాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

తనిఖీలు చేస్తున్న ఎఒ మురళీకృష్ణ

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

లైసెన్సులు లేని ఎరువుల దుకాణాల్లో ఎరువులు, పురుగు మందులు నిల్వ ఉంటే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని తాడేపల్లిగూడెం వ్యవసాయ శాఖ ఎఒ పి.మురళీకృష్ణ తెలిపారు. మంగళవారం నత్తారామేశ్వరం, మాముడూరులో ఎరువులు, పురుగు మందుల దుకాణాల ఎఒ మద్దాల జయదుర్గమాధురి ఆధ్వర్యంలో అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ వాసవీ పరమేశ్వరి ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్‌లో రూ.30,200 విలువైన ఎరువులు, రూ.1 లక్ష 12 వేల విలువ చేసే పురుగుమందుల అమ్మకాలు నిలిపివేసినట్లు తెలిపారు. డీలర్లు ఓ ఫారం, పీసీలు లేకుండా షాపుల్లో పురుగు మందులు, ఎరువులు అమ్మరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో కెఎస్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తణుకు

కాకినాడలో జరిగిన రెండో ఇంటర్ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో తణుకు కెఎస్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు అకాడమీ ఛైర్మన్ కేతా శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో మూడు రాష్ట్రాల నుండి 900 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. తమ అకాడమీ నుంచి 140 మంది కరాటే ప్లేయర్స్ ఖాతా, కుమిటి విభాగాల్లో పాల్గొని పతకాలు సాధించినట్లు చెప్పారు. ఓవరాల్ ఛాంపియన్ ట్రోఫీని మార్షల్ అకాడమీ సొంతం చేసుకుందన్నారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.

వైనాట్‌కు బ్లూస్టార్ గోల్డెన్ అవార్డు

ప్రజాశక్తి - తణుకురూరల్

వైనాట్ షాపింగ్ మాల్‌కు ప్రముఖ ఎసి ఉత్పత్తుల సంస్థ బ్లూస్టార్ గోల్డెన్ అవార్డును ప్రదానం చేసింది. చెన్నయ్ లీలా ప్యాలెస్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో వైనాట్ గ్రూప్ సంస్థల అధినేత జుజ్జవరపు వెంకటరాయుడు, బ్లూస్టార్ మేనేజింగ్ డైరెక్టర్ బి.త్యాగరాజన్, అధ్యక్షులు శశి అరోరా చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా వెంకటరాయుడు మాట్లాడుతూ సౌత్-2 (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒరిస్సా) ఏరియాలో చైన్ స్టోర్ డివిజన్‌లో పవర్ రిటైల్ కేటగిరిలో ఈ అవార్డు వచ్చినట్లు తెలిపారు. తమకు ఈ అవార్డు దక్కడం పట్ల సహకరించిన ఖాతాదారులకు అభినందనలు తెలిపారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేలా చూడాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

ఆసుపత్రిలో ఎక్కువ ప్రసవాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరు కార్యాలయం నుండి మండల, పిహెచ్‌సి స్థాయి వైద్యులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. హై రిస్క్ గర్భిణులను వారం రోజుల ముందుగానే ఆసుపత్రికి తరించి తగిన వైద్యం అందించాలన్నారు. గ్రామాల్లో గర్భిణులకు, యుక్త వయస్సు గల బాలికలకు, బాలింతలకు పరీక్షించి వారికి సక్రమంగా మందులు ఇవ్వడం తో పాటు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. 30పైబడి వయస్సు గల వారికి బిపి, షుగర్ పరీక్షలు చేయాలన్నారు. గ్రామ స్థాయిలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రతి కుటుంబం వినియోగించుకోనేవిధంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఎంఅండ్‌హెచ్‌ఒ డి.మహేశ్వరరావు, అడిషనల్ డిఎం అండ్ హెచ్‌ఒ భానునాయక్, డిసిహెచ్‌ఎస్ వీరాస్వామి పాల్గొన్నారు.

ఇసుక డిపోలు తప్పనిసరిగా నిర్వహించాలి

భీమవరం: పేదల ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక డిపోలను తప్పనిసరిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత ఏజెన్సీని ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ప్రశాంతి అధ్యక్షతన జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. జగనన్న కాలనీల నిర్మాణానికి అవసరమైన ఇసుక డిపోలను తప్పనిసరిగా సంబంధిత ఏజెన్సీ నిర్వహించాలని సూచించారు. జిల్లాలో ఇసుక రీచ్‌లపై సాంకేతిక అంశాలతో జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించి నివేదిక సమర్పించాలన్నారు. జిల్లాలో సిద్ధాంతం, సిద్ధాంతం-1, నడిపూడి, నడిపూడి-1 ఓపెన్ రీచ్‌ల్లో నీటి నిల్వలు ఎక్కువగా ఉన్న కారణంగా ప్రస్తుతం వినియోగంలో లేవన్నారు. కొత్తగా గుర్తించిన ఆచంట మండలం కోడేరు, కరుగోరుమిల్లి ఓపెన్ ఇసుక రీచ్‌లకు సమావేశంలో ఆమోదం తెలిపారు. జిల్లాలో ఉన్న ఎనిమిది డీసిల్టేషన్ పాయింట్ల గడువు గత డిసెంబర్‌లో ముగిసిందని తెలిపారు. ప్రజలకు, ప్రభుత్వ పనులకు నిరంతరాయంగా ఇసుకను సరఫరా చేసే నిమిత్తం తణుకు, తాడేపల్లిగూడెం, సిద్ధాంతంలో మూడు డిపోలను అందుబాటులో ఉంచామన్నారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ జెవి.మురళి, డిఎస్‌పి సుబ్బరాజు, గోదావరి రివర్ కన్జర్వేటర్ కాశీవిశ్వేశ్వరరావు, మైనింగ్ శాఖ డిడి బి.రవికుమార్, ఎడి ఎం.సుబ్రహ్మణ్యం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ వెంకటేశ్వర్లు, జిల్లా నీటి వనరుల అధికారి డి.నాగార్జున, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ రామస్వామి, జెపి వెంచర్స్ జిల్లా ఇన్‌ఛార్జి సిహెచ్.రాజారెడ్డి, ఓ.హరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

11న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జాతీయ అత్యున్నత న్యాయస్థానం, జిల్లా జడ్జి పురుషోత్తం ఆదేశాల మేరకు ఈ నెల 11వ తేదీన తాడేపల్లిగూడెం కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు మంగళవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. రాజీ పడదగిన క్రిమినల్, సివిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చున్నారు.

ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - పోడూరు

ఉపాధి హామీ బకాయిలు వెంటనే చెల్లించాలని సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేజర్లపేట శాఖా సమావేశం కొండేటి నాగేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులు ఉపాధి హామీ పనులు చేసి నెలలు గడిచిపోతున్నా కూలీల డబ్బులు మాత్రం విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. 200 రోజులు పని కల్పించి, రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేసవిలో మజ్జిగ, పని ప్రదేశాల్లో టెంట్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. శాఖ కార్యదర్శి మార్లంపూడి ఎలిజిబెత్ మాట్లాడుతూ వ్యసాయపనులు పూర్తయి నెల గడిచినా ఉపాధి పని చూపటంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రేజర్ కనకమ్మ, పిట్టా ముసలయ్య, తవిటిక పెద్దిరాజు పాల్గొన్నారు.

'జనసేనను ఆదరించాలి'

ప్రజాశక్తి - మొగల్తూరు

జనసేన నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ ఆధ్వర్యంలో జనంలోకి జనసేన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మంగళవారం మొగల్తూరు పంచాయతీ పరిధి నక్కవారిపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో జనసేన పార్టీని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొల్లాటి గోపి, దూది బాబు, బొక్కా చంటి, దాసరి కృష్ణాజీ, ఇంజేటి దానం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ ప్రతాప్‌కుమార్

కుష్టు వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరు పిహెచ్‌సిలో ఆశా డే సందర్భంగా జాతీయ కుష్టు వ్యాధి నిరోధక పక్షోత్సవాల్లో భాగంగా కుష్టు వ్యాధిపై అవగాహన సదస్సు డాక్టరు అద్దాల ప్రతాప్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎవరికైనా చర్మం పాలిపోయినా, రాగి రంగు మచ్చలు వచ్చినా, స్పర్శ లేకుండా ఉన్నా వైద్యులను సంప్రదించాలన్నారు. ముందస్తు చికిత్స ద్వారా వ్యాధిని నయం చేయొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి కె.ప్రభాకర్, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు

వ్యక్తికి సంవత్సరం జైలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఓ కేసులో నిందితుని నేరం రుజువు కావడంతో సంవత్సరం సాధారణ జైలు శిక్ష, రెండువేల రూపాయల జరిమానా విధిస్తూ పాలకొల్లు ఒకటవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ పీ బాను సాయి తీర్పు చెప్పారు. 2022లో రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుణ్ణం త్రివేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన ఎస్ఐ కె.శ్రీనివాస్ ముద్దాయి గరికి సుబ్బరాజుపై ఛార్జ్ షీట్ కోర్టులో దాఖలు చేయగా కేసు విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో అతనికి కోర్టు శిక్ష విధించినట్లు తెలిపారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

అనుమానస్పదంగా వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని శివదేవుని చిక్కాల గ్రామానికి చెందిన సంది రమేష్ (32) సోమవారం రాత్రి నోటి నుంచి నురగలు, ముక్కులో నుంచి తీవ్ర రక్తం వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు అతనిని పాలకొల్లు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం రమేష్ మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. మృతునికి 11 సంవత్సరాల క్రితం వివాహమైందని, ఇద్దరు పిల్లలు ఉన్నారని, మూడేళ్ల క్రితం భార్యతో విడాకులు తీసుకుని తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడని, మద్యానికి బానిసయ్యాడని ఆయన తెలిపారు. మృతుని తండ్రి ఇస్సాకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎమర్జెన్సీ సర్టిఫికెట్ (EC) పోయినది

TENNETI VIJAYA LAKSHMI అను నాకు KUWAIT రాయబార కార్యాలయం అధికారులు ది. 15-09-2020న **X0904500** నెంబరు గల ఎమర్జెన్సీ సర్టిఫికెట్ (EC) మంజూరు చేసారు. సదరు EC తీసుకొని నరసాపురం పట్టణంలోని మా బంధువుల ఇంటికి వచ్చిన సందర్భంలో మెయిన్‌రోడ్డు వద్ద నా ఒరిజినల్ EC పోయినది. గాన, నా ఎమర్జెన్సీ సర్టిఫికెట్ (EC) ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

TENNETI VIJAYA LAKSHMI
D/o. T.VIJAYA RATNAM, D.No.4-97
Poolapalli, Palakol Mandal,
West Godavari Dist., A.P.

డాక్యుమెంట్ పోయినది

కూకట్‌పల్లి, హైదరాబాదు కాపురస్తులు పి.నిఖిల్ వర్మ, తండ్రి: పి.శ్రీనివాసరాజు అను నాకు చెందిన ది.05-11-2007 సం॥రం తేదీన గునుపూడి (భీమవరం) సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో రిజిష్టర్డు కాబడిన **డాక్యుమెంట్ నెం. 181/2007 & 182/2007** రు గల ఒరిజినల్ లింకు దస్తావేజులు కవరులో పెట్టుకుని ది. 16-01-2023న నా ఫ్లాటు నం. F 103, H.No. 9-1-2/2, వెంకటేశ్వర నగర్, వార్డు నం. 19, భీమవరం నుండి ఎలక్ట్రికల్ సబ్ స్టేషనుకు (బస్సు డిపో దగ్గర గల) పోవుచున్నప్పుడు మార్గ మధ్యలో పడిపోయినవి. దొరికినవారు ఈక్రింది వారికి అందజేయ వలసినదిగా కోరుచున్నాను.

పి.నిఖిల్ వర్మ, సెల్: 9441258811